# డిటెక్టివ్ దొరైసామి

★ పి. యస్. కృష్ణ ★

తీగెలు లాగడంవల్లనైతేనేమి, చేతులు తడపడం వల్లనైతేనేమి, లేక తన వాక్చక్యం వల్లనే కానీయండి— ఎలాగైతేనేం మా దొరైసామి సి.ఐ.డి. ఉద్యోగం సంపాదించేడు. ఇంత మాత్రాన చంకలు గుద్దుకుంటూ కూర్చుంటే సరా? కన్ఫర్మ్ కావద్దూ? కనీసం రెండు ముఖ్యమైన కేసుల్లోనైనా ఆచోకీ తియ్యక పోతే మన వాడి ఉద్యోగానికి నామం పెట్టేస్తారు.

ఇదే తళాసీలో నిజాంబూరు' స్టేషను ప్లాటు ఫారం మీద పచార్లు చేస్తున్నాడు దొరైసామి. తన ప్రక్కనుంచే వెళ్లి ఆలా రిఫ్రెష్మెంటు రూములో దూరిన ఆ యిద్దరు వ్యక్తుల్నీ యిట్టే పసిగట్టేడు. గీతల ట్వీడు ట్రౌజరూ, బటరు సిల్కు ఓపెన్ జాకెట్టూ, కాళ్లకి వెలింగ్టన్ షూస్ కళ్లకి క్రూకూన్సు, తలకి పొడుంరంగు ఫెల్టూ, చేతులో 999 టిన్నూ, చూస్తే అంతా అట్టహాసంగావుంది. వనియంబాడీ మర్డరు కేసులో వీళ్లకి తప్పకుండా ఏదో లాలూచీ ఉండి తీరాలని అనుకున్నాడు. అసలు వాళ్లని చూసీ చూడగానే అనుకున్నాడు. గలాటా మనుషులని రెస్టారెంటు తలుపు సగం తెరిచి తొంగి చూసేడు. వాళ్లు ఆమ్లెటుమీద పెప్పరు పౌడరు జల్లుకుంటున్నారు. ఇదేమంచి ఛాన్సు అనుకొని గబగబా వాళ్ల లగేజి ఉన్న స్థలానికి దౌడుతీసేడు దొరైసామి ఆడా మొగా అనే భేదం లేక. అన్నివిధాల తాళం కప్పలనూ తెరిచే తన "మాస్టరుకీ" సహాయంతో ఆలెదరు సూటుకేసు యిట్టే తెరచి చూసేసరికి— ఆశ్చర్యం!... అమోఘం!!... దాన్నిండా మనిషిపుర్రెలూ, బొమికలూ -అప్పా- రాత్రికల లోకి వస్తాయి! ఇంకేం? తన అనుమానం నిజమైంది, తన కష్టం ఫలించింది, తన అదృష్టం పువ్వులు పూసింది. ఇంక తను కన్ఫర్మ్ అయినట్టే. ఆరుముగం, వెంకట్రామన్ సేతురామన్ వీళ్లందరితో పాటు తనుకూడా యింక కాలరు ఎత్తుకొని తిరగ వచ్చును.

ఇంక ఆ ఖూనీదారుద్దరూ మాట్లాడుకొనే విషయాలు మెల్లిగా వెనకనుంచి వినాలి. తను క్రేపుసోలు షూస్ వేసుకోడం మంచిదే అయింది. తను కొత్తగా లోడుచేసిన ఫ్లాషులైటు కెమెరా చేత బట్టుకొని మెల్లిగా రెస్టారెంటు లోకి వెళ్లి వాళ్లమాటలను వింటున్నాడు.

"...అసలు సుపీరియరు మేక్సిలరీ ఫొరామిన్ అంతక్రిందకి..."

"అదికాదోయి, పుల్లయ్యా! నేను చెప్పేది ఫొరామిన్ ఒవేలిస్ గురించి మన ఎనాటమీ ప్రొఫెసరు కూడా......"

అరే! కొంపతీసి వీళ్లు మెడికలు కాలేజి స్టూడెంట్సు గాని కాదుకదా! ఆస్టియాలజీ తర్కించుకుంటున్నారు;

"...అంతగా అనుమానంగావుంటే, పైకిరా! నాసూటు కేసులో 'స్కల్' తీసి చూపిస్తాను."

మరి యింక అనుమానం లేదు. వీళ్ల తస్సాదియ్యా యింత సేపు నన్ను అవస్థపెట్టి చంపేరు. ఒకఫిల్మూ, ఒకబల్బుకూడా దండుగ చేసేను వీళ్ల కోసం! అదిపల్లికు ప్లాటుఫారం, 'అందమాదిరి పణ్ణైకుడాదు' అని పూరుకున్నాడు కాని లేకపోతే దొరైసామి అలాగే, అక్కడే మూర్ఛపోదామనుకున్నాడు.